# 19. తిరుకురిప్ప తొండనాయనారు

తొండైమండలం ఒక భాగ్యసీమ. దానికి కంచి ముఖ్యపట్టణము. ఆగమముల ప్రకారము ఇచ్చటనే పార్వతి శివుని గూర్చి తపమొనరించినది. ఇచ్చట శివుడు ఏకామ్ర నాథుడుగా పిలువబడుతాడు.

తిరుత్తొండారు ఇచ్చటనే జన్మించాడు. రజకుడుగా పుట్టాడు. శివధ్యానైక తత్పరుడు. శివభక్తులను ఆదరించేవాడు. సేవించేవాడు. వారి ముఖాల్ని చూచి, వారల అవసర ముల గుర్తెరిగి వాళ్లకు సహాయమందించేవాడు. అందుకని అతనికి తిరుకురిప్ప తొండ నాయనారు అని పేరు వచ్చింది. శివభక్తుల బట్టలనుతికేవాడు. శివుడు ఈతని భక్తికి మెచ్చి - అందరికి అతని విశేషము తెలియబరచాలనుకున్నాడు.

శివుడు ఒక పేదవానిగా రూపొంది, మెడకు రుద్రాక్షతో, దేహమంతా విభూతి పుండ్రములతో, చిరిగిపోయిన దుస్తులతో తిరుత్తొండారుకు ప్రత్యక్షమయ్యాడు. అతనిని చూడగానే తిరుత్తొండారుకు మైకం కమ్మింది. తేరుకొని, అతనిని కొలిచాడు. ఆగంత కుని ప్రశ్నించాడు. "స్వామీ! మా ఇల్లు, మీ రాకతో పావనమయింది. ఎందుకని మీరు చిక్కిపోయారు? మీ దుస్తులను ఉతికి పెట్టనీయండి. మీకు సేవ చేయనీయండి" అని అర్థించాడు. ఆ శివభక్తుడు ఒక షరతుతో ఆ బట్టలనుతుకుటకు అనుమతిచ్చాడు.
ఆ నిబంధన: ఆ బట్టలు ఉతికి, ఆరవేసి తనకు సూర్యాస్తమయంలోపల అందజేయాలి. లేనియెడల బక్కచిక్కిన తను, చలికి చనిపోతాడు అని".

తొండారు ఇందుకు అంగీకరించాడు. అంగీకరించే సమయానికి ఎండ బాగానే వుంది. వెంటనే ఆ బట్టలనుదికాడు. ఆరవేసే సమయానికి పెద్దవాన మొదలిడింది. సూర్యుడస్తమించే సమయం వచ్చింది. ఆ బట్టలు ఆరే పరిస్థితి కనబడలేదు. తొండారు తబ్బిబ్బయ్యాడు. శివభక్తునికి తాను సహాయము చేసే బదులు అతనిని కష్టాలపాలు చేసే స్థితికి వచ్చింది. ఈ పాపాన్ని తలుస్తూ ఆ బట్టలుతికే రాయికి తన తలను వేసి కొట్టుకు న్నాడు. దేవుని ప్రార్థించాడు. పరిస్థితిని చూచి ఆక్రందించాడు.

శివుడు ఆ ఆక్రందనకి కరిగి ప్రత్యక్షమై తొండారును అభినందించి, భక్తికి మెచ్చు కొని - 'త్వరలో నన్ను చేరగలవు. నా దగ్గరే వుండగలవు' అని అనునయంగా పల్కాడు.

తిరుత్తొండారు పరవశించి, శివుని పాదములపైబడి తన్మయత్వంతో శివుని నుతించాడు.